15 నుంచి టిజిఐసెట్ ఫైనల్ కౌన్సెలింగ్

- 23న అన్ ఎయిడెడ్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు
- ఐసెట్ కన్వీనర్ శ్రీదేవసేన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 15 నుంచి ఐసెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, టీజీ ఐసెట్ కన్వీనర్ ఎ.శ్రీదేవసేన ప్రకటించారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 15 వరకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. 16న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. 16, 17 తేదీల్లో కాలేజీల ఆప్షన్లను ఎంపికచేసుకోవాలనీ, 17న ఆప్షన్లు ఫ్రీజ్ చేస్తామని పేర్కొన్నారు. 20న సీట్లు కేటాయిస్తామనీ, 20 నుంచి 22 వరకు ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టు ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. 22,23 తేదీల్లో కేటాయించబడ్డ కాలేజీల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రయివేటు అన్ ఎయిడెడ్ కాలేజీల్లో 23న ఎమ్‌బీఏ, ఎమ్‌సీఏ స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాల కోసం http:// tgicet. nic.in ను సంప్రదించాలని సూచించారు.

ఆ ఇద్దరు... ఆరుగురికి జీవం పోశారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జీవన్‌దాన్‌కు మరో ఇద్దరి అవయవాలను దానం చేశారు. దీంతో ఆరుగురికి కొత్త జీవితం లభించింది. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు మాగుంట లేఅవుట్, కేకేఆర్ గౌతం స్కూల్ నివాసి మారెళ్ల అభిలాష్ (28) సాఫ్ట్ వేర్ ఇంజినీర్. ఆగస్టు 30న ద్విచక్రవాహనంపై ఉండి డివైడర్‌ను ఢీ కొనడంతో తీవ్ర గాయాపాలయ్యారు. వెంటనే అతన్ని హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స అందించిన అనంతరం సెప్టెంబర్ 6న ఆయన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ అతని తల్లి మారెళ్ల సునీత అవయవదానం చేయాలని నిర్ణయించారు. దీంతో అభిలాష్ నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, ధర్మాబాద్ (బి), వెంకటరమణ కాలనీకి చెందిన బుర్ర రమేష్ (33) ప్రయివేటు ఉద్యోగి. గత రెండేళ్ల నుంచి ఆయన హైబిపితో బాధపడుతున్నారు. ఈ నెల 5న తీవ్రమైన తలనొప్పి, వాంతుల తర్వాత ఆయన పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు ప్రయివేటు ఆస్పత్రికి తరలించి, అక్కడ్నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించారు. సెప్టెంబర్ 7న బుర్ర రమేష్ బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. భర్తను కోల్పోయిన తీవ్ర విషాదంలోనూ ఆయన భార్య బుర్ర మౌనిక అవయవదానం కోసం ముందుకొచ్చారు. దీంతో రమేష్ నుంచి కాలేయం, రెండు కార్నియాలను సేకరించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి 138 డొనేషన్స్ వచ్చినట్టు జీవన్ దాన్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు. అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబాలు అనేక మందికి స్ఫూర్తిగా నిలిచాయని అభినందించారు.



సాగర్‌కు పెరిగిన వరద నీరు

- 14 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం నుంచి వస్తున్న వరద నీరు పెరుగుతూ ఉండటంతో ఆదివారం సాయంత్రానికి నాగార్జునసాగర్ 14 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 1,46,339 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 1,66,993 క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరుకుంటుండగా ప్రస్తుతం సాగర్ జలాశయంలో 589.70 అడుగులుగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువ ద్వారా 9500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులను, ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 3373 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు.. మొత్తంగా సాగర్ జలాశయానికి వచ్చింది వచ్చినట్టుగా 1,66,993 క్యూసెక్కులను బయటికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలంకు ఎగువ నుంచి 1,07,407 క్యూసెక్కులు వస్తుండగా శ్రీశైలం ప్రాజెక్టు మూడు గేట్లు పది అడుగుల మేరకు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 884.30 అడుగులుగా ఉంది.

పేదలకు పది లక్షల ఎకరాల భూమి పంచింది కమ్యూనిస్టులే..

- సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తున్న బిజెపి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజాకర్లకు వ్యతిరేకంగా పోరాడి 4000 మంది కమ్యూనిస్టులు మరణించారని, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బ్రిటిషు వాళ్ళు దేశాన్ని 200 ఏళ్లు పాలిస్తే, 1946-51 మధ్య నైజాం సర్కార్ తెలంగాణను పాలించిందని, దేశ సంపదను బ్రిటిష్ వాళ్ళు దోచుకుంటే తెలంగాణలో భూస్వాములు, పట్వారీ వ్యవస్థ రాజ్యమేలుతుండేవారని తెలిపారు. మొత్తం భూమిలో 50శాతం నైజాం సర్కార్ చేతుల్లో ఉండేదని గుర్తుచేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లాలోని మన్సూరాబాద్‌లోని ఎంఇ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో 'వీర తెలంగాణ సాయుధ పోరాటం-వక్రీకరణాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. నైజాం కాలంలో జనగాం ప్రాంతంలో రామచంద్రారెడ్డి అనే భూస్వామికి 1,50,000 ఎకరాల భూమి ఉండేదన్నారు. తెలంగాణ అంతట వెట్టిచాకిరి నడిచేదని, భూస్వాములు, పెత్తందారులు, పట్వారీలకు లొంగి పని చేయాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ఈ దుర్భర పరిస్థితి నుంచి ప్రజలను కాపాడేందుకు 1930లో ఆంధ్ర మహాసభ పేరుతో కమ్యూనిస్టు పార్టీ ప్రజల ముందుకు వచ్చిందని చెప్పారు. చాకలి ఐలమ్మ ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న సందర్భంలో కోతకు వచ్చిన పంటను భూస్వాములు, పట్వారీ వ్యవస్థ, రజాకర్లు కబ్జా చేస్తుంటే భీమిరెడ్డి నరసింహారెడ్డి దళం ఆ పంటను రక్షించి భూస్వాముల గుండాలను ఎదిరించి కమ్యూనిస్టులు ఆమెను రక్షించారని తెలిపారు. ఐలమ్మ కుటుంబం నాశనం అయినా ఆమె వెనుకడుగు వేయకపోవడంతో ఒక్కసారిగా ఉద్యమం ఉధృతం అయిందని అన్నారు. ఆ సమయంలో 1946లో దొడ్డి కొమరయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు అయ్యారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు పేదలకు 10 లక్షల ఎకరాల భూములు పంచి పెట్టారని తెలిపారు. కానీ ఇప్పుడు తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి హిందూ, ముస్లిం పోరాటంగా వక్రీకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో 65 లక్షల ఓటర్ల పేర్లు తొలగించారని అన్నారు. ప్రజాప్రతినిధి అవినీతి కేసులో ఇరుక్కొని 30 రోజులు జైల్‌లో ఉంటే వారి పదవి పోతుందని ఇటీవల పార్లమెంట్‌లో నూతన చట్టాన్ని తెచ్చేందుకు బిజెపి ప్రయత్నించిందని అన్నారు. వారి ఆటలు సాగకుండా ప్రతి ఒక్కరూ ఓటు రూపంలో బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసర నర్సిరెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, సిపిఎం నాయకులు వీరయ్య, శ్రీనివాస్, యాదిరెడ్డి, మల్లేశం, కృష్ణయ్య, గణేష్, సంధ్య,రామస్వామి, భాస్కర్, అనిల్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

రాజ్యాంగం అమలుకు - విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు

ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి పలువురు మేధావులు సంఘీభావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఈనెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికలు.. 'రాజ్యాంగం అమలుకు, రాజ్యాంగం విధ్వంసానికి' మధ్య జరుగుతున్నాయని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి సంఘీభావంగా ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, పౌర హక్కుల నేత, ప్రొఫెసర్ జి.హరగోపాల్, విద్యా కమిషన్ సభ్యులు పిఎల్ విశ్వేశ్వరయ్య, సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువల రక్షణకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపు ముఖ్యమని, దీనికోసం తెలుగు రాష్ట్రాల ఎంపిలు కృషి చేయాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి సిఫార్సు చేయడం వల్ల బిఆర్ఎస్ పార్టీ ఓటు వేయబోమని చెప్పడం సరికాదన్నారు. ఆయన ఇండియా కూటమి అభ్యర్థి అని గ్రహించాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర ఉందనే విషయాన్ని బిఆర్ఎస్ గ్రహించి, ఆయనకు మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత వారిపై ఉందని తెలిపారు. ఆయన గెలుపు తెలుగు జాతి వికాసానికి మరింత దోహదం చేస్తుందన్నారు.ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగం అమలు కోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి జీవితాంతం పాటు పడ్డారని అన్నారు. చరిత్ర, న్యాయశాస్త్రంపై సంపూర్ణ అవగాహన ఉన్న ఆయన్ను గెలిపించాలని కోరారు. దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, తన 55 ఏండ్ల బోధనా వృత్తిలో ఏనాడూ తరగతి గదుల్లో ఈ అంశం బోధించాలని, ఇది బోధించకూడదనే ఆంక్షలు లేవన్నారు. కానీ నేడు విశ్వవిద్యాలయాల్లో బోధనా అంశాలపై అధ్యాపకులు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వం కోసం ఏర్పడిన బిఆర్ఎస్ ఆయనకు మద్దతు ఇవ్వకపోతే, ఇప్పుడు ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న నమ్మకం కోల్పోతుందన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఏర్పడిన టిడిపి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి మద్దతుగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన మాట్లాడే గొంతుకగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కేంద్ర హోంశాఖ మంత్రి సుదర్శన్ రెడ్డిని మావోయిస్టుల సానుభూతిపరునిగా మాట్లాడుతున్నారని, ఆయన ఉద్యోగ విరమణ తర్వాత బిజెపి ప్రభుత్వం ఆయన్ను గోవా లోకాయుక్తగా నియమించినప్పుడు అది గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పిఎల్ విశ్వేశ్వర్‌రావు, రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపునకు 82 ఓట్లు మాత్రమే తేడా ఉన్నాయని, బిఆర్ఎస్, టిడిపి, జనసేన, వైసిపి ఎంపిలు ఆయనకు ఓటు వేస్తే గెలుస్తారని స్పష్టం చేశారు.

నగరంలో నకిలీ వైద్య దందా

- వైద్యుల ముసుగులో అబార్షన్లు, ఇన్ఫెర్టిలిటీ సేవలు
- పలువురు నకిలీ వైద్యులపై కేసులు నమోదు, రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యులు యథేచ్ఛగా వైద్యం చేసేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి అబార్షన్లు, ఇన్ఫెర్టిలిటీ సేవలను సైతం అందించడానికి వెనుకాడటం లేదు. అవసరాలకు మించి హై ఎండ్ యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ ఇస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నా.. దందా మాత్రం ఆగడం లేదు. ఆస్పత్రులకు అనుమతులివ్వడం, నిబంధనలు అతిక్రమించిన, అనధికారికంగా నడిచే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటున్నా.. నకిలీ వైద్యులు, ఆస్పత్రులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. తెలంగాణ వైద్య మండలి చేస్తున్న వరుస దాడులతో దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి.

హై ఎండ్ డ్రగ్స్ వినియోగం

ఆర్ఎంపిలు, అనధికారిక క్లినిక్‌లలో మోమోసెఫ్, నెలోజెల్, జెంటా మెడిసిన్ 30 ఎంఎల్ వైల్స్ వంటి హై ఎండ్ యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ వినియోగిస్తున్నారు. న్యూరాలజీ స్పెషలిస్టు వైద్యులు, గైనకాలజీ సూపర్ స్పెషాలిటీ వైద్యులు రాసిన మందులు చిన్న, చిన్న క్లినిక్‌లలో దర్శనమివ్వడంతో తనిఖీలకు వెళ్లిన వైద్యుల బృందం ఆశ్చర్యానికి గురవుతోంది. ఒక ఇన్ఫెక్షన్లకు



నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకున్న అధికారులు

ఎంత మొత్తంలో యాంటీ బయోటిక్ డ్రగ్ ఇవ్వాలనేది ఎఎంఎఫ్‌సి గైడ్‌లైన్స్ స్పష్టం చేస్తున్నాయి. చిన్నపాటి ఇన్ఫెక్షన్లకు హైఎండ్ యాంటీబయోటిక్ మందులు ఇస్తున్నారు. దాంతో కిడ్నీ సమస్యలు వస్తాయి. అధిక మొత్తంలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి నశించి, డయాబెటిస్, కెట్రాక్ట్ సమస్యలు వస్తున్నాయి. భవిష్యత్‌లో ఇన్ఫెక్షన్లు త్వరగా వస్తాయి. కోవిడ్ సమయంలో దాదాపు 10 లక్షల మంది మృతి చెందగా, యాంటీబయోటిక్స్ అధికంగా వినియోగించడం వల్ల భవిష్యత్‌లో అంతకంటే ఎక్కువ మరణాలు సంభవించే ప్రమాదముందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే క్రమంలో అర్హత లేని వ్యక్తులకు అమ్మొద్దని వైద్యులు సూచిస్తున్నారు.

మూడు రకాల డ్రగ్స్ వినియోగం

నకిలీ వైద్యులు మూడు రకాల రకాల డ్రగ్స్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. నగరంలో అర్హత లేని వైద్యులు, క్లినిక్‌లపై తెలంగాణ వైద్య మండలి ఆధ్వర్యంలో దాదాపు 200 కేసులు నమోదు చేశారు. ఇటీవల ఉప్పల్‌లో అర్హత లేని వైద్యుడు ఇచ్చిన మందులు వికటించి జిమ్ ట్రైనర్ చనిపోయాడు. నగరంలో అర్హత లేని వైద్యులు చేసిన చికిత్సలకు చాలా వరకు అమాయకులు బలైపోతున్నారు. నకిలీ వ్యక్తి వైద్యం చేస్తే ఎలా ఉంటుందనే దానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రజలు నిపుణులైన వైద్యులను మాత్రమే సంప్రదించాలని వైద్యులు, తెలంగాణ వైద్య మండలి సూచిస్తోంది. నకిలీ వైద్యులు, అనధికారిక క్లినిక్‌లపై ఫిర్యాదులను 91543 82727 ఈ నెంబర్‌కు చేయొచ్చు.

పలువురిపై కేసులు నమోదు

నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి, విజిలెన్స్ ఆధ్వర్యంలో కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల వరుస తనిఖీలతో బాగోతాలు బయట పడుతున్నాయి. ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండలో 10 మంది నకిలీ వైద్యులను గుర్తించి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బౌరంపేట, దుండిగల్, సూరారం పరిధిలో ఎనిమిది మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా కాటేదాన్, శివరాంపల్లి, బాలాపూర్ ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నకిలీ వైద్యులు యాంటిబయోటిక్, స్టెరాయిడ్స్ ఇంజెక్షన్స్ ఇస్తూ, ప్రెస్క్రిప్షన్స్ రాస్తూ పట్టుబడ్డారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

- అధికారులు, సిబ్బందికి రేవంత్ అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శోభాయాత్ర ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. వినాయక విగ్రహ ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు విమజ్జనం విజయవంతంగా ముగియడానికి ఎంతో సహకరించారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా సాగేందుకు సహకరించిన ప్రజలందరికీ సిఎం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఎర్రజెండా వారసత్వాన్ని ప్రజలకు అందించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎర్రజెండా ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాల వారసత్వాన్ని ప్రజలకు అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం వనపర్తి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆ పార్టీ నాయకులు రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్రభాష్యం పలుకుతోందన్నారు. ఈ పోరాటంతో సంబంధం లేకపోయినా తమ ఆధ్వర్యంలోనే జరిగిందన్నట్టుగా ప్రజలకు భ్రమ కల్పిస్తోందని విమర్శించారు. తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటానికి బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, మల్లు స్వరాజ్యం, నరసింహారెడ్డి లాంటివారెందరో నాయకత్వం వహించారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లక్షల ఎకరాల భూమిని పంచి దొరలు, జాగిర్దారులు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం నడిపారన్నారు. వారి త్యాగ ఫలితాన్ని కమ్యూనిస్టులు వారసత్వంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని బిజెపి ఆనాటి పోరాటయోధుల జయంతి, వర్ధంతులు నిర్వహిస్తూ ప్రజలను మభ్యపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీల నాయకులు ముఖ్యంగా సిపిఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన తీరును ప్రజలకు తెలియజేసేలా సభలు, సమావేశాలు పెట్టి విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ నెల 10న ఐలమ్మ వర్ధంతి, 12న సీతారాం ఏచూరి వర్ధంతి, 17న తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవంగా జరుపుకుంటున్నామని, 10 నుంచి 17వ తేదీ వరకు గ్రామగ్రామన ఎర్రజెండాలు ఎగరవేసి సభలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్, జిల్లా ముఖ్య నాయకులు మండ్ల రాజు, మేకల ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, సాయిలీల, ఆది, ఆర్ఎన్ రమేష్ పాల్గొన్నారు.

టిటిఇల కోసం బయోమెట్రిక్ సైన్

- డిజిటలైజేషన్ దిశగా టికెట్ తనిఖీ కార్యకలాపాలు : దక్షిణ మధ్య రైల్వే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టికెట్ తనిఖీ కార్యకలాపాలను మరింత పారదర్శకం చేయడానికి టికెట్ తనిఖీ సిబ్బంది కోసం బయో మెట్రిక్ సైన్-ఆన్, సైన్-ఆఫ్‌ను దక్షిణ మధ్య రైల్వే ప్రవేశపెట్టింది. ప్రయోగాత్మకంగా ఆరు ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ లాబీలను (సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంతకల్, గుంటూరు మరియు నాందేడ్) ఎంపిక చేసింది. త్వరలో జోన్‌లో 73 టిటిఇ లాబీల్లో అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఆదివారం ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రజాసంబంధాల అధికారి శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'గతంలో టికెట్ తనిఖీ సిబ్బంది యొక్క సైన్-ఆన్/సైన్-ఆఫ్ కార్యాచరణ వినియోగదారు పేరు, పాస్‌వర్డ్ ఉపయోగించి జరిగేది. ప్రస్తుతం టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్ విధానాన్ని క్రమబద్ధీకరించడానికి, టిటిఇ లాబీలలో ఆధార్ ఆధారిత బయో మెట్రిక్ సైన్-ఆన్/సైన్-ఆఫ్ కార్యాచరణను ప్రవేశపెట్టాం. టిటిఇ లాబీ అప్లికేషన్‌లో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని సి-డిఎసి పోర్టల్‌తో అనుసంధానించాం. దీని ద్వారా సోర్స్ స్టేషన్, గమ్యస్థాన స్టేషన్‌లో టికెట్ తనిఖీ సిబ్బంది భౌతికంగా ఎక్కడున్నారనే దాన్ని తెలుపుతుంది. టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్/లాగౌట్ సమయాలను వాస్తవ సమయ ప్రాతిపదికన రికార్డవుతుంది' అని తెలిపారు. జోన్‌లో ఈ సాంకేతిక పురోగతిని అమలు చేసినందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వాణిజ్య సిబ్బందిని అభినందించారని తెలిపారు. డిజిటల్ టెక్నాలజీలను అమలు చేయడంలో దక్షిణ మధ్య రైల్వే ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు.

బయో కెమిస్ట్ ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు?

- నిబంధనలు కాదని తుది జాబితాలో పేర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో నిర్వహించిన బయోకెమిస్ట్ ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదోన్నతుల కోసం రూపొందించిన ప్రొవిజనల్ లిస్ట్‌లో కనబడని కొన్ని పేర్లు తుది జాబితాలో ప్రత్యక్షం కావడమే ఈ అనుమానాలకు తావిచ్చింది. ఈ ఉద్యోగోన్నతి పొందేందుకు ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ పూర్తి చేసిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 అభ్యర్థులు అర్హులు. ఈ మేరకు అక్టోబర్‌లో అధికారులు అర్హుల నుంచి వివరాలు సేకరించారు. ఆ సేకరించిన వివరాల ఆధారంగా ఈ ఏడాది మే నెలలో ప్రొవిజనల్ సీనియారిటీ లిస్ట్‌ను తయారు చేశారు. అందులో ఒక ప్రొఫార్మాను రూపొందించి ఎవరైతే ఇన్ సర్వీసులో ఉండి ఆ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకుని దూరవిద్య ద్వారా అర్హతకు అవసరమైన విద్యను పూర్తి చేశారో వారు అర్హులని పేర్కొన్నారు. ఆ మేరకు జాబితా తయారు చేశారు. అనంతరం ప్రకటించిన తుది జాబితాలో మాత్రం అనుమతి తీసుకోని అభ్యర్థుల పేర్లు ఉండటంతో మిగిలిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రొవిజనల్ లిస్ట్‌లో లేని పేరు తుది జాబితాలో ఐదో స్థానంలో చేర్చడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితా కేవలం ప్రభుత్వంలోని ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ నిబంధనలను కాలరాయడమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కోశాధికారి జియావుద్దీన్ ఆకస్మిక మృతి

- ఉపాధ్యాయుడుగా మొదలు సంఘం నేత, ప్రజాప్రతినిధిగా ప్రస్థానం
- టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ
- ప్రముఖుల సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుటిఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కోశాధికారి, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ మెంబర్, సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సయ్యద్ జియావుద్దీన్ (76) గుండెపోటుతో శనివారం అర్ధరాత్రి సమయంలో ఆకస్మికంగా మృతిచెందారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మరణించారు. జూన్ ఎనిమిది, 1950లో జియావుద్దీన్ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడులో జన్మించారు. ఆయనకు భార్య ముస్తారీబేగం, కుమారుడు జావీద్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు జావీద్ నవతెలంగాణ దినపత్రిక ఖమ్మం రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. జియావుద్దీన్ భౌతికకాయాన్ని ఉపాధ్యాయ, వామపక్షాలు, వివిధ పార్టీల నేతలు, జర్నలిస్టులు, అధికార, అనధికారులు సందర్శించారు.

పలువురి సంతాపం

ముస్తఫానగర్‌లోని స్వగృహంలో జియావుద్దీన్ భౌతికకాయం ఉంచగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ సందర్శించి నివాళులర్పించారు. ఉదయం 10 గంటల సమయంలో సందర్శనార్థం భౌతికకాయాన్ని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యాలయానికి తీసుకుని రాగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, టిఎస్ యుటిఎఫ్ నాయకులతో కలిసి పార్టీ జెండాతో పాటు యూనియన్ జెండాను భౌతికకాయంపై కప్పారు. కుమారుడు జావీద్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ తదితరులు సంతాప సందేశాలను పంపారు. జడ్పీ కో ఆప్షన్ మెంబర్‌గా, ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయ సంఘం నేతగా, సీపీఐ(ఎం) తిరుమలాయపాలెం మండల కార్యదర్శిగా జియావుద్దీన్ సర్ అందించిన సేవలను కొనియాడుతూ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు రంజాన్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు.

సమస్యలపై గళమెత్తిన జియావుద్దీన్

ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయసంఘం నేతగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆదివాసీ విద్యార్థులకు అందుతున్న మెనూపై జియావుద్దీన్ సర్ ఆందోళనలు చేపట్టారని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి చావా రవి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని తదితరులు తెలిపారు. ఐటిడిఎ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్య అందేలా కృషి చేశారని గుర్తుచేశారు. టీచర్‌గా, ఆశ్రమ స్కూల్ హెడ్మాస్టర్‌గా, వార్డెన్‌గా చింతూరు మండలం గూడూరు మొదలు విఆర్ పురం మండలం సోములగూడెం, భద్రాచలం మండలం కొత్తూరు నారాయణపురం వరకు ఏజెన్సీ ప్రాంతంలో సుదీర్ఘకాలం పనిచేశారని చెప్పారు. సిపిఎం తిరుమలాయపాలెం మండల కార్యదర్శిగా ఏడు పంచాయతీలు, ఒ ఎంపిటిసి ఆ పార్టీకి దక్కేలా కృషి చేశారన్నారు. జడ్‌పి కో ఆప్షన్ మెంబర్‌గా పనిచేసి సమావేశాల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి అందరి మన్ననలు చూరగొన్నారని తెలిపారు. ఆదర్శ కమ్యూనిస్టుగా నిబద్ధతతో వ్యవహరించారన్నారు.



జియావుద్దీన్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సంతాప సభలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, మల్లారెడ్డి, శాంతి, జ్ఞానమంజరి, రాజు, కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, వివిధ జిల్లాల బాధ్యులు ఎం.వెంకటేశ్వర్లు, సైదులు, వెంకటేశం, అనీల్, రంజిత్‌కుమార్, యాకూబ్, వెంకటేశం, శ్యాంబాబు, ఖమ్మం జిల్లా ఆఫీస్‌బేరర్లు బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, బి.రామదాసు, బి.నాగేశ్వరరావు, ఎం.నర్సయ్య, బి.ప్రశాంతి, నాగుల్‌వలీ, రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర నాయకులు మౌలానా, సైబర్ క్రైం ఎసిపి ఫణీంద్ర, సిపిఎం సీనియర్ నాయకులు పి.సోమయ్య, బత్తుల హైమావతి, ఎం.సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, రాజారావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, అన్నవరపు సత్యనారాయణ, బ్రహ్మాచారి, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, యర్రా శ్రీనివాస్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. జియావుద్దీన్ భౌతికకాయంపై నవతెలంగాణ దినపత్రిక చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు జావీద్‌ను ఓదార్చారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

In the Court of the Hon'ble District and Sessions Judge ::Anantapuramu

CR.M.P.NO: 92 / 2025 in C.R.P.NO: / 2025 (in the matter of C.C.NO:146/2021 filed Under NI Act before the file of 1st Spl. Magistrate Court: District Court Campus: Anantapuramu)

Between:
B.Chandra Sekhar, Police Constable, S/o B. Ramaiah, HNO:02-164, 2nd Road, New town, Ananthapuramu Town & District.
...Petitioner/Crim. Rev. Petitioner.
And
M. Polu Raju, Occ: Police Constable, S/o. M. Venkataiah, residence: H.No:07-01-304,-40, 1st Floor, Raghavendra Nagar, B.K.Guda, Sanath Nagar, Ameer Peta, Sanjeevareddy Nagar, Hyderabad City & District..
...Respondent/Accused.

NOTICE

Please take Notice in the above CR.M.P.NO: 92 of 2025 in C.R.P.NO: /2025, which is the Petition filed for condonation of delay in filing C.R.P., filed by the Petitioner/Crim. Rev. Petitioner as mentioned above, in which you are the Respondent/Accused. The said case is posted to dated:26-09-2025 you shall appear without fail before the Hon'ble District & Sessions Court:; Anantapuramu at 10-30 AM to submit objections if any. Otherwise, the mater will be decided in your absence, this is notice to you.

(By Order of Court)

Tuluva Shiva Prasad,
M.Com LL B.DLL,
Advocate for the Crim. Rev. Petitioner.
Mobile: 94407 66895.

నేడు పిసిసి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఈనెల 15న కామారెడ్డిలో జరగనున్న బహిరంగ సభ నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో జరగనున్న ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డిసిసిల అధ్యక్షులు, ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలు, అనుబంధ సంఘాల చైర్మన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రత్యేక కార్యక్రమాల కో -ఆర్డినేటర్లు తదితరులు హాజరుకానున్నారు.

డిమాండ్ మేరకే నర్సింగ్ కాలేజీలకు అనుమతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నర్సింగ్ విద్యను ప్రోత్సహించి, గ్రామీణ యువతకు రాష్ట్రంలో, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నది. ప్రపంచవ్యాప్తంగా నర్సులకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, గతేడాది రాష్ట్రవ్యాప్తంగా16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి 23 ప్రయివేటు నర్సింగ్ కాలేజీలకు అనుమతించిన సంగతి తెలిసిందే. నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జపాన్, జర్మన్ వంటి దేశాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని.. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న నర్సింగ్ స్టూడెంట్స్‌కు ఇంగ్లీష్, జర్మన్ తదితర విదేశీ భాషలు నేర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీతో (ఇఫ్లూ) సహకారంతో విద్యార్థులకు లాంగ్వేజెస్ నేర్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది.

రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో గతేడాది 6,956 మంది నర్సులకు ఉద్యోగాలు ఇవ్వగా, ఈ ఏడాది మరో 2,322 మందికి ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. నర్సులకు ఉన్న డిమాండ్‌ను సానుకూలంగా మల్చుకుని రాష్ట్ర యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే చర్యలపై కొంతమంది దురుద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నం చేయడాన్ని ఆరోగ్యశాఖ ఖండించింది. నర్సింగ్ కాలేజీల అనుమతులపై తప్పుడు వార్తలు రాయించడం శోచనీయం అని అధికారులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా పదుల సంఖ్యలో ప్రయివేటు నర్సింగ్, పారామెడికల్ కాలేజీలకు అనుమతులిచ్చారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో కొత్త హాస్పిటల్స్ ఏర్పడ్డాయనీ, ప్రభుత్వ హాస్పిటల్స్ సంఖ్య పెరిగిందనీ, హోమ్ కేర్ నర్సింగ్‌కు ప్రాధాన్యత ఏర్పడిందనీ, ఈ నేపథ్యంలో నర్సులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరిగాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో నర్సింగ్ విద్యను అభ్యసించే అభ్యర్థుల సంఖ్య కూడా పెరిగిందని, ఇందుకు అనుగుణంగా కాలేజీల సంఖ్య కూడా పెరగాల్సిన అవసరముందన్నారు. నర్సుల సుదీర్ఘ డిమాండ్ అయిన నర్సింగ్ డైరెక్టరేట్ సైతం ఏర్పాటు చేయడానికి కేబినేట్ ఆమోదం తెలిపింది.

మాంట్రియల్‌లో లక్ష్మీనరసింహ కళ్యాణ మహోత్సవం

యాదగిరిగుట్ట ఇఒ వెంకట్రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కెనడా అసోసియేషన్(టీసీఏ) ఆహ్వానం మేరకు ప్రభుత్వ అనుమతులతో మాంట్రియల్‌లో లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణమహోత్సవం నిర్వహించినట్టు యాదగిరి గుట్ట ఇఒ వెంకట్రావు తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కార్యక్రమంలో టిసిఎ అధ్యక్షులు మన్నెం శ్రీనివాస్, యాదగిరి గుట్ట దేవాలయం తరపున ఎఇఒ రఘు, విశ్రాంత ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు. అర్చకుల బృందాన్ని మంత్రి కొండా సురేఖ అభినందించారని తెలిపారు. త్వరలో బ్రిటన్, యూరప్, మలేషియా దేశాలల్లో లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం నిర్వహించేందుకు బృందాలను పంపనున్నట్టు వెల్లడించారు.

టెట్‌పై సుప్రీం తీర్పును సమీక్షించాలి : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐదేండ్ల పైబడి సర్వీసున్న టీచర్లందరూ రెండేండ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కాకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాలన్న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని టిఎస్‌యుటిఎఫ్ డిమాండ్ చేసింది. సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని విన్నవించింది. ఆదివారం ఈ మేరకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సిటిఇ నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటికే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ అవసరమా? లేదా? అనే వివాదంపై వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. మైనారిటీ విద్యా సంస్థల్లో నియామకాలకు టెట్ తప్పనిసరా? కాదా? అనే అంశంపై మహారాష్ట్రకు సంబంధించిన కేసుతోపాటు, ప్రమోషన్ల విషయంలో తమిళనాడు ఉపాధ్యాయుల కేసులను కలిపి విచారించిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ ఒకటో తేదీన వెలువరించిన తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు నష్టదాయకంగా మారింది.



పైసలకు కటకట!

- కేంద్రం నుంచి నిధులు రావు..ఇక్కడ ఆదాయం పెరగదు
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం
- అటకెక్కిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- బతుకమ్మ చీరెలకు మంగళం
- గట్టెక్కించే మార్గాల అన్వేషణలో సర్కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. గతం నుంచి వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. రోజువారీ ఖర్చులు, చెల్లింపులకు కూడా కటకట మొదలైంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై చూపిస్తున్న వివక్ష దీనికి ప్రధాన కారణం కాగా.. ఆదాయ మార్గాలను అన్వేషించటంలో, ప్రత్యామ్నాయ వనరులను సృష్టించుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం మరో కారణంగా కనిపిస్తోంది. అనివార్యంగా ఇది సంక్షేమ, అభివృద్ధి పథకాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు, ఇతర సహాయాల రూపంలో రాష్ట్రానికి రూ.22,782 కోట్లు వస్తాయని రేవంత్ సర్కారు అంచనా వేసుకుంటే, జులై చివరి నాటికి అందులో రూ.790 కోట్లే వచ్చాయి. ఇప్పుడు ఆగస్టు కూడా ముగిసింది. అంటే బడ్జెట్ ప్రవేశపెట్టి ఐదు నెలలు పూర్తయ్యాయన్నమాట. మిగతా రూ.21,992 కోట్లు ఎప్పటిలోగా వస్తాయనేది పెద్ద సందేహమే. మరోవైపు 2025-26 బడ్జెట్‌లో రెవెన్యూ రశీదుల ద్వారా మొత్తం రూ.2,29,720 కోట్ల మేర ఆదాయం వస్తుందంటూ సర్కార్ అంచనా వేసుకుంది. కాగా జులై నాటికి ఈ రూపంలో కేవలం రూ.50,270 కోట్లే ఖజానాకు చేరాయి. గతేడాది (2024-25)తో పోలిస్తే ఇందులో కొంత శాతం (.30 శాతం) రాబడి పెరినప్పటికీ ఓవరాల్‌గా వేసుకున్న అంచనాల్లో తగ్గింది. పన్నేతర ఆదాయం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.31,681 కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేసుకుంటే, అందులో జులై నాటికి కేవలం రూ.1,334 కోట్ల ఆదాయమే వచ్చింది. బడ్జెట్ ప్రవేశపెట్టి ఆర్నెలు పూర్తయిన నేపథ్యంలో మిగతా ఆర్నెల్లలో మిగిలిన రూ.30,284 కోట్లు ఎలా సమకూరుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఈ విధంగా ఉండటంతో కీలకమైన పథకాలు, కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయలేకపోతున్నామని ఆర్థికశాఖ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' తమకు అత్యంత ప్రతిష్టాత్మకమైన పథకమని ముఖ్యమంత్రి రేవంత్ పదేపదే చెప్పారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన వ్యవసాయ కార్మికులందరికీ ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం తెలంగాణ వ్యాప్తంగా ఐదు లక్షల మంది లబ్దిదారులను గుర్తించారు. కానీ వీరిలో ఇప్పటి వరకూ రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పూర్తిగా, మిగతా జిల్లాల్లో ఒక్కో మండలానికి ఒక్కో గ్రామాన్ని గుర్తించి, అక్కడి కార్మికులకు మాత్రమే ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ రకంగా చూస్తే కేవలం 88 వేల మందికి రూ.51 కోట్లను మాత్రమే పంపిణీ చేశారు. మిగతా వ్యవసాయ కార్మికులు ఈ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

బిఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టిన సర్పంచులు, అందుకోసం దాదాపు రూ.400 కోట్లను ఖర్చు చేశారు. వారిప్పుడు ఆ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలంటూ సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తయిన తర్వాత గత సంవత్సన్నర కాలంగా పంచాయతీల్లో కార్యదర్శులే వివిధ పనులను చేపడుతున్నారు. వీధి లైట్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, హరితహారం కింద పెంచిన మొక్కలకు నీరుపోయడం, ట్రాక్టర్ల నిర్వహణ వగైరా పనులను వారు చేపట్టారు. ఇందుకోసం మొదట తమ సొంత డబ్బును ఖర్చు పెట్టి, ఆ తర్వాత బిల్లులు క్లెయిమ్ చేసుకోవాలంటూ ప్రభుత్వం వారిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారికి సర్కారు ఇప్పటి వరకూ రూ.51 కోట్లను చెల్లించాల్సి ఉంది. మరోవైపు రాష్ట్రంలోని 60 లక్షల మంది ఆడపడుచులకు ప్రతీయేటా దసరాకు బతుకమ్మ చీరెలను ప్రభుత్వం సరఫరా చేసేది. ఇందుకోసం రూ.312 కోట్లను వెచ్చించామని ఆర్థికశాఖ తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అంత మొత్తంలో నిధులను వెచ్చించలేక, ఈసారి నుంచి కేవలం మహిళా పొదుపు సంఘాల్లోని వారికే చీరెలను పంపిణీ చేస్తామని ప్రకటించింది. అంటే మిగతా వారికి చీరెలను ఇవ్వలేమని తేల్చి చెప్పింది.

ఈ క్రమంలో ఆర్థిక కష్టాల నుంచి బయటపడేందుకు అన్వేషణను ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆర్థికశాఖకు సుదీర్ఘకాలం పాటు ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉండి, ఆ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన కే.రామకృష్ణారావును దీనిపై ప్రధానంగా దృష్టి సారించాలంటూ వారు కోరారు. అందుకే ఆగస్టుతో పూర్తయిన ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలంటూ డిఒపిటికి సర్కారు లేఖ రాసింది. ఇప్పుడాయన పదవీకాలాన్ని డిఒపిటి మరో ఏడు నెలలపాటు పొడిగించింది. 2026 మార్చి వరకు, ఇంకా చెప్పాలంటే వచ్చే బడ్జెట్ నాటి వరకూ సిఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించబోతున్న ఆయన... రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్థిక కష్టాల నుంచి ఏ రకంగా గట్టెక్కిస్తారో వేచి చూడాలి.

ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధి టాటానగర్‌లోని ప్లాస్టింగ్ గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అత్తాపూర్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ చందునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. టాటా నగర్‌లోని ప్లాస్టిక్ గోదాం నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. గోదాంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు నిల్వ ఉండటంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగలు వ్యాపించాయి. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సుమారు నాలుగు గంటలు కష్టపడి 2 ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అయితే ఈ ఘటనకు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏవైనా కారణాలున్నాయా అని విచారిస్తున్నారు. అగ్నిప్రమాదం సమయంలో గోదాం లోపల కార్మికులెవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నివాసాల మధ్యలో ఇలాంటి గోదాంలు ఉండడంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్స్‌లో సింధూర నారాయణకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డా.పి సింధూర నారాయణకు ప్రతిష్టాత్మక సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్ వరించింది. దుబాయ్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డా.సింధూరను ఘనంగా సన్మానించారు. దక్షిణ భారత దేశంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతులైన వ్యక్తులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. డా.సింధూర నాయకత్వంలో నారాయణ విద్యాసంస్థ ఆసియాలోనే అతిపెద్ద విద్యాసంస్థగా ఎదిగిందని నిర్వాహకులు ప్రశంసించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముందుగా ఉత్పత్తులు తయారుచేసి వాటికోసం మార్కెట్ వెతకడం కంటే సమస్యలకు పరిష్కారం వెతకడమే ముఖ్యంగా తాను విశ్వసిస్తానని అన్నారు. అప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని చెప్పారు. విద్యాప్రమాణాలు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండాలనీ, నారాయణ విద్యాసంస్థలు ఆ దిశగా ముందుకెళుతున్నాయని వివరించారు.

గిరిజనుల సౌకర్యాల కోసం నిధులు కేటాయించండి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- ములుగు జిల్లాలో సిపిఎం పాదయాత్ర ముగింపు సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పాదయాత్రలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి, తదితరులు

ఆపరేషన్ కగార్ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడమే కాకుండా హెలికాప్టర్లు, 35 వేల మంది సైన్యంతో గిరిజనులను ఇబ్బందులకు గురిచేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలోని గిరిజనుల రవాణా సౌకర్యం కోసం 100 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించకపోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ములుగు జిల్లా యాకన్నగూడెం నుంచి వెంకటాపురం వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం వెంకటాపురం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ పాదయాత్ర యాకన్నగూడెం నుంచి వెంకటాపురం వరకు 32 కిలోమీటర్లు సాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో మండల కార్యదర్శి గ్యానం వాసు అధ్యక్షతన జరిగిన పాదయాత్ర ముగింపు సభలో జూలకంటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇసుక దోపిడీపై ఉన్న ఆసక్తి గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై లేదన్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి ములుగు జిల్లా వెంకటాపురం వరకు ఉన్న 100 కిలోమీటర్ల రహదారిపై ప్రతినిత్యం 50, 60 టన్నులపైగా బరువుతో వందలాది లారీలు ప్రయాణం చేస్తుంటాయని తెలిపారు. వాటి అధిక బరువు వల్ల రహదారి అధ్వానంగా తయారయిందన్నారు. గుంతల్లో పడి ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. ఏజెన్సీలోని ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వానికి ప్రతిరోజూ కోటికి పైగానే ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఇంత ఆదాయం వస్తున్నా రోడ్డు మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన భద్రాద్రి ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు.. బిఆర్ఎస్ పార్టీలో ఉంటే భద్రాద్రి అభివృద్ధి సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని ఏజెన్సీ ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. భద్రాద్రి జిల్లాలో ఉన్న 65 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఆ జిల్లా పార్టీ ఉద్యమాలు చేస్తుందన్నారు. ములుగు జిల్లాలో ఉన్న 32 కి.మీ రహదారి నిర్మాణానికి రూ 100 కోట్లు కేటాయించాలని పాదయాత్ర చేసినట్టు చెప్పారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని పోరాటాలు చేస్తూ ఉంటే స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపి బలరాం నాయక్, మంత్రి సీతక్క ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న పోరాటాన్ని రోడ్ల భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

గ్రామస్తులకు కృతజ్ఞతలు : కృష్ణారెడ్డి

సిపిఎం ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటానికి వెంకటాపురం గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ల అధ్వానానికి నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో గత నెలలో వెంకటాపురం బంద్‌కు పిలుపునిస్తే గ్రామ వ్యాపారస్తులు స్వచ్చందంగా ఎన్నడూ లేని విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు దుకాణాలను మూసివేసి పోరాటానికి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా తమ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలో వందలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కార్యదర్శి బి.రెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శ్రీను, వంకా రాములు, చారి, జజ్జరి దామోదర్, సాధనపల్లి దేవమణి, పరికిశ రాంబాబు, మాణిక్యం, తోట నాగేశ్వరావు, శ్రీను పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్-2, 3లకు నేడు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ పునరుజ్జీవన పథకంలో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను మంచినీటితో నింపేందుకు ఉద్దేశించిన గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ 2, 3లకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.7360 కోట్లతో ప్రభుత్వం హామ్ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి వాటా పెట్టనుండగా, కాంట్రాక్టు కంపెనీ 60 శాతం నిధులు సమకూర్చనుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సర్కారు నిర్ణయించింది. ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టిఎంసిల నీటిని తరలించనున్నారు. అందులో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నింపి మూసీ పునరుజ్జీవనానికి 2.5 టిఎంసిలు కేటాయిస్తారు. మిగతా 17.50 టిఎంసిలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. మార్గమధ్యలో ఉన్న ఏడు చెర్వులను నింపుతారు. డిసెంబర్ 2027 నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతి రోజు నల్లా నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును లక్ష్యంగా ఎంచుకున్నారు.

ఒఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా జిహెచ్ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టును సిఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.1200 కోట్లతో 71 రిజర్వాయర్లు నిర్మించారు. వాటిలో కొత్తగా ఇటీవల నిర్మించిన 15 రిజర్వాయర్లను సిఎం ప్రారంభిస్తారు. సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఆర్‌సీ పూరం, పటాన్‌చెరు, బొల్లారంతో పాటు మొత్తం 14 మండలాల్లోని 25 లక్షల మందికి తాగునీరు అందనుంది. కోకాపేట్ లేఅవుట్ సమగ్రాభివృద్ధి, నియో పోలీస్- సెజ్‌కు తాగునీటితో పాటు మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసే రూ.298 కోట్ల ప్రాజెక్టుకు సిఎం శంకుస్థాపన చేయనున్నారు.



ఎస్‌సిఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సండేస్ ఆన్ సైకిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం జరిగింది. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ పాల్గొని నిర్వాహకులను అభినందించారు. 150మంది వరకు క్రీడాకారులు, రైల్వే ఉద్యోగులు, అధికారులు సైక్లింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫిట్ ఇండియా మూవ్‌మెంట్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.



ప్రజాసమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు : జహంగీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని, సమస్యలను పూర్తిగా విస్మరించాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎమ్‌డి జహంగీర్ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామంలోని 20 కుటుంబాలు సిపిఎంలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. లక్ష్మీదేవి కాలువ సిపిఎం గ్రామశాఖ కార్యదర్శిగా ఎక్కిగ్రవంగ బండి లక్ష్మీనరసింహస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి సుమారు రెండేళ్లవుతున్నా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ అలవికాని హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో ఇబ్బందిపడుతుంటే అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. అదే విధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. కులాలు, మతాల మధ్య పంచాయితీలు పెడుతూ ప్రజలను వీడదీస్తుందే తప్ప రాష్ట్రాల ప్రయోజనాలను కాపాటడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు మాట్లాడుతూ.. గతంలో లక్ష్మీదేవి కాల్వ గ్రామంలో సిపిఎం బలమైన ఉద్యమాలు చేసి అనేకసార్లు సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచిందన్నారు. సిపిఎంకు మళ్లీ పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిని బరిలో ఉంచి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఆకుల సోమల్లు, భీమనబోయిన భద్రయ్య, పనుమాటి నాగయ్య, ఆకుల సత్యనారాయణ, ఆనంతుల సోమయ్య, మామిడ్ల నర్సయ్య, బండి యాదయ్య, బోమగాని వీరయ్య, పొన్నాల నర్సయ్య, చెరుకు యాకుబ్, చింత లచ్చయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, అడ్డగూడూరు మండల కార్యదర్శి బుర్రు అనిల్‌కుమార్, చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్, సిపిఎం సీనియర్ నాయకులు వళ్ళంబట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

పొలాల కోసం ప్రాణాలైనా అర్పిస్తాం

ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మాకు జీవనాధారంగా మిగిలి ఉన్న కొద్దిపాటి పొలాల కోసం ప్రాణాలైనా అర్పిస్తాం' అని ట్రిబుల్ ఆర్ రోడ్డు భూ నిర్వాసితులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గతంలో ప్రకటించిన పాత అలైన్‌మెంట్ స్థానంలో భూస్వాములకు అనుకూలంగా, చిన్న, సన్నకారు రైతులకు ఉరితాడుగా రూపొందించిన కొత్త అలైన్‌మెంట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతులు ఆమనగల్ పట్టణంలో ఆందోళన చేపట్టారు. తలకొండపల్లి మండలంలోని జంగారెడ్డి పల్లి, రాంపూర్, చంద్రదన, జూలపల్లి తదితర గ్రామాల రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం దగ్గరలోని పాటు శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైటాయించారు. బడాబాబులకు, భూ స్వాములకు అనుకూలంగా రూపొందించిన కొత్త అలైన్‌మెంట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నూతన అలైన్‌మెంట్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ట్రిబుల్ ఆర్ రోడ్డు భూ నిర్వాసితులైన చిన్న, సన్నకారు రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జియావుద్దీన్ గొప్ప ఉద్యమనాయకుడు : వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జియావుద్దీన్ గొప్ప ఉద్యమకారుడనీ, తనకు స్ఫూర్తినిచ్చిన నాయకుల్లో ఒకరని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొంటూ సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం జిల్లాలో జియావుద్దీన్, రవిలతో తనకున్న ఉద్యమ అనుబంధాన్ని పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో రిటైరైనా చివరకంటూ నమ్మిన సిద్ధాంతం ఆయన పనిచేశారని కొనియాడారు.

బీహార్‌లో బిజెపికి వ్యతిరేక పవనాలు

సిపిఐ నారాయణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బీహార్‌లో బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి ఇటి నర్సింహతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే తొమ్మిదేండ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి స్లాబులను తగ్గించిందని చెప్పారు. జిఎస్‌టి కౌన్సిల్‌ను సంస్కరించాలని డిమాండ్ చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయకపోతే బిజెపి, బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందని అనుకునే పరిస్థితి వస్తుందన్నారు. వివిధ రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలకు బిజెపి ఒక భస్మాసుర హస్తంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అంశంలో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21 నుంచి 25 వరకు పంజాబ్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయనీ, ఈ సభలో జాతీయ రాజకీయ, ఇతర పలు అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు. కూనంనేని మాట్లాడుతూ.. గత ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగు వ్యక్తి అని వెంకయ్యానాయుడుకు మద్దతిచ్చిన బిఆర్ఎస్ ప్రస్తుత ఎన్నికల్లో కూడా తెలుగువ్యక్తి, తెలంగాణ బిడ్డ, జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేస్తారా?, లేదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజలు గర్వించదగ్గ నాయకుడు రావి నారాయణ రెడ్డి

ప్రజలు గర్వించదగ్గ నాయకుడు రావి నారాయణ రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ సిపిఐ కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావినారాయణ రెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా మఖ్దూం భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నిజాం రాచరికానికీ, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఆంధ్ర మహాసభలో చేరారని చెప్పారు. ఆంధ్ర మహాసభకు రెండుసార్లు అధ్యక్షునిగా ఎన్నికైన రావి నారాయణ రెడ్డి... దొరల భూస్వాముల ఎదిరించాలంటే సాయుధ పోరాటమే పరిష్కారమని మఖ్దూం, బద్దం ఎల్లారెడ్డిలతో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని చెప్పారు. వేలాది గ్రామాలను విముక్తి చేసి లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచారన్నారు. కార్యక్రమంలో ఈటీ నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ తదితరులు పాల్గొన్నారు.